కారు ముందుకి నడవసాగింది నెమ్మదిగా. అతని చేతిమీద పడిందామె చేయి.

"ఇలా ఇటు తిప్పండి సార్, చూశారా లేకపోతే అటు వెళ్ళి పోతుందిది. పర్లేదు సార్ ఇంకా దగ్గరకు రండి".

సురేష్ కుడివేపే చూస్తూ కారుని రోడ్ మధ్య వుంచేందుకు ప్రయత్నిస్తున్నాడు. అతని మోచేయి ఆమె భారీ స్తనాలకు తగులుతోంది. నిగ్రహం పూర్తిగా పోతోంది అతనికి. ఆమె మరింత హత్తుకుపోతోంది తనకు. కావాలనే చేస్తోందా అలా? తెలీటం లేదతనికి.

చెమటలు పట్టేస్తున్నాయి. రక్తం వేడిగా ప్రవహిస్తోంది. కోరికలు కళ్ళేలు తెంచుకుంటున్నాయి.

ఒకేసారి రెండు డ్రయివింగ్‌లు.

"ఇప్పుడు యాక్సిలేటర్ ట్రై చేస్తారా సార్!" అమె ఊపిరి మెడమీద చక్కిలిగిలి పెడుతోంది.

"ఆ.....ఆ..........ఆ..........." అతి కష్టం మీద గొంతు పెగల్చుకుని అన్నాడు.

ఆమె కాలు పక్కకు జరిపింది . తను యాక్స్‌లేటర్ మీద కాలు పెట్టాడతను. కారు సెక్యూరిటీ గేట్ దగ్గరకొచ్చేసింది. వాళ్ళను చూడగానే గేటు తెరిచాడు సెక్యూరిటీ గార్డ్. కారు బయటకు పరుగెత్తింది. నెమ్మదిగా, అయిదు నిమిషాలు రోడ్డు మీద డ్రైవ్ చేశాక తిరిగి ఎస్టేట్ లోకి చేరుకున్నారు.

"ఇంక చాలా సర్ యివాల్టికి? " ఆమె పెదాలు తన పెదాలకు అతి సమీపంగా వచ్చేసినయ్. ఆమె శరీరం మెత్తగా భుజానికి హత్తుకుని డ్రిల్లింగ్ చేస్తోంది. ఇంక అదుపులో పెట్టుకోవటం సురేష్ వల్ల కావటం లేదు. తులసి మనసులో నిండిపోయింది. వెచ్చటి ఆమె కౌగిలి గుర్తుకొస్తోంది. హఠాత్తుగా ఆమె పెదాలు తన పెదాలకు హత్తుకుపోతున్నాయ్.

బ్రేక్‌తో ఆగిపోయింది కారు. ఇంజన్ ఆఫ్ అయిపోయింది.

కొద్దిక్షణాల్లోనే అతని ఉధృతం తగ్గింది. "ఐయామ్ సారీ!" అన్నాడు నొచ్చుకుంటూ నిజంగానే బాధగా వుందతనికి ఎందుకిలా దిగజారిపోతున్నాడు రోజు రోజుకీ?

"ఇంక యింటికి వెల్దామా?" రహస్యంగా అడిగిందామె.

అతనికి భయంగా వుందిప్పుడు. విక్కీ ఎం దుకంతగా కవ్వించింది తనను? ఏదయినా ప్లాన్ వుందా ? కాటేజ్‌కి చేరుకోగానే తన గదిలోకెళ్ళి మంచం మీద పడుకున్నాడు.

"నువ్వెక్కడుంటావ్?"

"ఈ కాటేజ్‌లోనే వెనుక వైపు గది సర్. ఎప్పుడు అవసరమైతే అప్పుడు ఈ

బటన్ నొక్కండి చాలు. వచ్చేస్తాను- ఏం కావాలన్నా ముఖవాటపడకండి"

ఆమె వెళ్ళిపోయింది.

మంచం మధ్యలో కూర్చుని చాలా సేపు ఆలోచనల్తో సతమత మయ్యాడతను.

మాధురి  గుర్తుకొస్తోందతనికి.

రోజూ తన గదిలోకొచ్చి గడిపేదామె.

మరి ఇవాళ రాత్రి కూడా వస్తుందా?

బహుశా.......

ఇంత దూరంలో వుండటం  వల్ల రాకపోవచ్చు.  వస్తే  తమ రహస్యం అర్జున్  కనిపెట్టే అవకాశం వుంది.  టైమ్ పన్నెండయిపోయింది.  వెన్నెలలో కాంతి చాలా భాగం తగ్గిపోయింది.  చీకటి నెమ్మదిగా ఆవరిస్తోంది.

లైటార్పి మంచం మీద పడుకొని కళ్ళు మూసుకొంటూండగా విని పించింది తలుపు తట్టిన శబ్దం. మాధురే వచ్చి వుంటుంది.  ఉత్సాహంగా మంచం దిగి  లైటు వేసి తలుపు తెరచాడు.

ఎదురుగా అర్జున్ నిలబడి వున్నాడు.  అతని ముఖమంతా చెమటలతో నిండిపోయింది.

కళ్ళల్లో కంగారు, ఆతృత స్పష్టంగా కనబడుతున్నాయ్.

త్వరగా లోపలికొచ్చి తలుపులు దగ్గరగా మూసేశాడతను.

"సురేష్!    త్వరగా  రడీ అవ్.  మన ఇంటికి వెళ్ళాలి అర్జంటుగా .  నువ్వు మామూలుగానే అక్కడ నీ గదిలో పడుకో ఈ రాత్రికి".

తనతో ఇంత రాత్రి వేళ ఏమిటి పని?

"కమాన్!  అలా నుంచోకు అర్జెంట్.  వెంటనే బయలేరాలి నువ్.  త్వరగా డ్రస్ మార్చుకో"

సురేష్ పక్క గదిలోకి నడిచి బట్టలు  మార్చుకోసాగాడు! మార్చుకునే లోపలే ఓసారి గదిలో కొచ్చేశాడు అర్జున్.

"త్వరగా కానీ సురేష్ ! ఆలస్యం చేయకు"

సురేష్ త్వరగా డ్రస్  మార్చుకుని బయటకు రాబోతూంటే వినిపించింది ఫోను క్లిక్ మనటం.  ఎవరో ఫోన్లో మాట్లాడ్డానికి ప్రయత్నిస్తున్నట్లున్నారు.  ఒకవేళ మాధురీ కాదు కదా.

చటుక్కున ఫోన్ అందుకున్నాడతను .

అప్పటికే ఎవరో మాట్లాడడం  వినిపిస్తోందందులో.

"శరత్ పారిపోయాడు.  మన వాళ్ళు వెతుకుతున్నారు.  ఒకవేళ ఎస్టేట్స్ వైపు వస్తే

వెంటనే సెక్యూరిటి గార్డ్స్‌కి చెప్పి వాడిని పట్టించు. ఏ పరిస్థితిలోనూ వాడు తప్పించుకు పారిపోటానికి వీల్లేదు " మాధురి గొంతు భయంకరంగా వినబడుతోంది.

"అలాగే మేడమ్!" విక్కీ గొంతు.

"జాగ్రత్త! అర్జున్ రూపంలో వున్నది శరత్ అన్న విషయం సురేష్‌కి తెలీకూడదు"

"అలాగే మేడమ్"

"కమాన్ సురేష్! క్విక్ " ఆత్రుతగా అన్నాడతను.

బయట అర్జున్ కారు వుంది.

"త్వరగా వెళ్ళు ఈ కార్లో"

"నాకు డ్రైవింగ్ సరిగ్గా రాదు సర్"

"ఏం ఫర్లేదు ఇప్పుడు రోడ్లన్నీ ఖాళీ! త్వరగా స్టార్ట్ చెయ్"

"మరి మీరు........"

"నేనిక్కడే వుండాలి. కొన్ని కారణాల వల్ల నేను యిక్కడ నా కాటేజ్‌లో వుండటం అవసరం"

సురేష్ కార్లో కూర్చోగానే అతను సురేష్ కిచ్చిన ఎర్ర రంగు మారుతీలో కూర్చున్నాడు.

సురేష్‌ని ఆలోచనలు శరవేగంతో చుట్టుముడుతున్నాయ్!

అర్జున్ రూపంలో వున్న శరత్ యితనే అయుండాలి. ఇతనే మాధురి భవనం నుంచి పారిపోయి ఇక్కడికి వచ్చి వుండాలి. అతని భయం కంగారు ఆత్రుత అన్నీ స్పష్టంగా చెపుతున్నాయ్ తప్పించుకు పారిపోతున్నాడని.

కారు దిగి సుజుకి దగ్గరకు నడిచాడు. అతను అప్పుడే కారు ఇంజన్ స్టార్ట్ చేశాడు.

ఇంకొద్ది క్షణాలయితే తనకిక దొరకడు వాడు.

"మళ్ళా వచ్చావేమిటి? త్వరగా వెళ్ళమని చెప్పడం లేదూ? ఇది నీ జాబ్ సురేష్ ! నీకు ఊరికే జీతం యివ్వటం లేదు"

సురేష్‌కి అర్థమయిపోయింది. తను అలా చూస్తూంటే వాడు మారుతిలో పారిపోవటం ఖాయం. అసలిదంతా ఏమిటో? అర్జున్ రూపంలో వీడు కూడా ఎందుకు తిరుగుతున్నాడో, అన్నీ తెలుసుకోకుండా వీడిని వదిలేస్తే మళ్ళీ రహస్యాలు తెలుసుకునే అవకాశమే దొరక్కపోవచ్చు.

చటుక్కున కారు డోరు తెరచి చొక్కా పట్టుకున్నాడు సురేష్ .

"ఎవర్నువ్వు? నిజం చెప్పు" అన్నాడు తీవ్రంగా.

అతను చొక్కా వదిలించుకోడానికి ప్రయత్నిస్తూ కోపంగా చూశాడు.

"ఏమిటా పిచ్చివాగుడు? నేనెవరయిందీ కనబడటంలా?"

"తెలుసు నువ్వు శరత్‌వి"

అతను వులిక్కిపడ్డాడు. ముఖం కళ తప్పింది.

"అబద్ధం. ఎవరు చెప్పారు నీకు?"

"నువ్వు మాధురికి తెలీకుండా తప్పించుకు పారిపోవడానికి ప్రయత్నిస్తున్నావు"

అర్జున్ ఇంకొక్కక్షణం కూడా ఆలస్యం చేయలేదు. కారు ఇంజన్ స్టార్ట్ చేసి నడపటానికి ప్రయత్నించాడు గానీ సురేష్ అతని చేయి పట్టుకుని బలంగా బయటకు లాగటంలో కార్లో నుంచి క్రింద పడిపోయాడు. కారు ఒక జెర్క్ యిచ్చి ఆగిపోయింది.

అర్జున్ కింద పడుతూనే అతని చేతి నుంచి తప్పించుకుని శరవేగంతో రోడ్డు మీదకు పరుగెత్తాడు.

సురేష్ వెంటనే వెనుక నుంచి తన కాలు అడ్డం పెట్టాడు. రోడ్డు దిగి గుట్టల్లోనూ తుప్పల్లోనూ పరుగెడుతున్నకొద్దీ నిమిషాల్లోనే యిద్దరి మధ్యా దూరం తగ్గిపోయింది.

అతని కాళ్ళకు వెనుక నుంచి తన కాలు అడ్డం పెట్టాడు సురేష్ . అంతే ఆ వేగంతో అతను దభేల్‌మంటూ కిందపడి కొంత దూరం బంతిలా దొర్లాడు.

సురేష్ అతని దగ్గరకు గెంతి అతని చాతీ మీద కాలు వుంచి నొక్కిపట్టాడు.

"నిజం చెప్పు ఎవర్నువ్వు?"

అతను లేచి కూర్చోటానికి ప్రయత్నించాడు గానీ సురేష్ మరింత గట్టిగా నేల కేసి అదిమిపెట్టాడు. ఆయాసంతో రొప్పుతున్నాడతను.

"ముందు జవాబు చెప్పు"

"నా పేరు శరత్" వప్పుకున్నాడతను. "నేను అర్జున్ కాదు"

సురేష్ కాలు తీయగానే అతను బట్టలు దులుపుకుంటూ లేచి నిలబడ్డాడు,

"ఈ డ్రామా అంతా ఏమిటిప్పుడు ?" అడిగాడు సురేష్.

"సురేష్! మనిద్దరం పంజరంలో బంధింపబడ్డాం. మనిద్దరినీ ఇవాళో రేపో వాళ్ళు చంపేస్తారు" భయంగా అన్నాడతను.

సురేష్ గుండె వేగంగా కొట్టుకోసాగింది.

"నీకెలా తెలుసు?"

"ఇందాకే సహదేవ్, మాధురి మాట్లాడుకోవటం విన్నాను. అర్జున్‌కి కొద్దిసేపటి క్రితమే హార్ట్‌ఎటాక్ వచ్చింది. డాక్టర్ పరీక్షించి చెప్పేశాడు. బ్రతకటం కష్టం అని"

సురేష్ సన్నగా వణుకు ప్రారంభమైంది.

"మననెందుకు చంపటం?"

"ఎందుకేమిటి?  మనతో పనయిపోయింది. వాళ్ళక్కావలసినవన్నీ మనిద్దరి వల్లా సమకూరాయ్.  కోట్ల కొద్దీ బ్యాంక్ లోన్స్, కాంట్రాక్టులు, బిజినెస్ అన్నీ. అర్జున్ చచ్చిపోయాక ఇంక  మననెందుకు బ్రతకనిస్తారు?  లేనిపోని సమస్యలు రావూ వాళ్లకు. అందుకే ఆనవాల్లేకుండా స్మాష్ చేసేస్తారు మనల్ని".

అతను మళ్ళీ కారు వేపు పరుగెత్తబోయాడుగానీ సురేష్ ఆపేశాడు.

"అది సరే!  నన్ను  మాధురి ఇంటికెళ్ళమంటున్నా వెందుకు?"

అతను ఓ క్షణం మౌనంగా వుండిపోయాడు.

"సారీ సురేష్!  స్వార్థం.  నా ప్రాణం మీద తీపి.  ఈ రాత్రికి నన్ను నా గదిలోనే చంపేస్తారని తెలుసు.  అందుకని నా స్థానంలోకి నిన్ను  పంపితే నేను  తప్పించుకోవచ్చని...."

అంత భయంలోనూ శరత్ మీద కోపం ముంచుకొచ్చింది సురేష్కి.  తనను బలిపశువుగా  చేసి వాడు పారిపోవాలని ఈ ఎత్తు వేశాడు.

"సురేష్! ఇవాళో, రేపో అంతే!  నిన్నూ  చంపేస్తారు. తప్పించుకు పారిపో" అనేసి  ఒక్క ఉదుటున అతని చేయి విదిలించుకుని పరిగెత్తుకు వెళ్ళి తన కార్లో కూర్చుని వేగంగా  నడుపుకుంటూ వెళ్ళిపోయాడు.

కొద్ది  క్షణాలపాటు నిశ్చేష్టుడయి నిలబడి పోయాడు సురేష్ .

తనే కాకుండా శరత్కి కూడా అర్జున్లా ప్లాస్టిక్  సర్జరీ చేయించారన్నమాట.  ఇద్దరిలో ఎవరయినా ఎదురు తిరగటం గానీ , పారిపోవటంగానీ చేస్తే వాడిని ఆనవాల్లేకుండా చంపి పారేసి రెండోవాడితో కార్యక్రమాలు నడుపుకోటానికి.

అవును! తను ఇప్పుడు పారిపోతే?  మాధురి  సాయంత్రమే ఫోన్ లో చెప్పింది . ఇప్పుడు  తను నగరంలోకి కూడా వెళ్ళి వచ్చేందుకు స్వాతంత్ర్యం  వుందని !  తనను సెక్యూరిటీ గార్డ్లు అడ్డుపెట్టరు.  సాయంత్రం తనూ,  విక్కీ డ్రైవింగ్ కెళ్ళినపుడు కూడా వారేమీ  పట్టించుకోలేదు. త్వరత్వరగా సుజుకి కారువేపు నడిచాడతను.

ఇదే  అవకాశం తప్పించుకోడానికి.  అతి శక్తివంతమైన టార్చిలైటు కాంతి సురేష్ ముఖం మీద పడింది.

నిశ్చేష్టుడయి నిలబడిపోయాడు అతను.  లైటు క్రమేపీ దగ్గరగా వచ్చేస్తోంది.

తను దొరికిపోయాడు.  ఇప్పుడే తనను  చంపేస్తారేమో!

"మీ కోసం ఇల్లంతా వెతుకుతున్నా సర్!  ఇక్కడున్నారా?"  టార్చిలైటు వెనుకనుంచి మాట్లాడింది  విక్కీ.  కొంచెం ధైర్యం వచ్చింది అతనికి.

"నిద్రపట్టక అలా కాసేపు వాకింగ్ చేద్దామని"

టార్చిలైటు ఆరిపోయింది.  విక్కీ  రూపం అస్పష్టంగా కనబడుతోంది.

"చీకట్లో తిరిగటం మంచిది కాద్సార్ ఇక్కడ ! ఇక్కడ పాములుంటాయ్. బెనర్జీ అనే బెంగాలీ అతను యిదే కాటేజ్‌లో మన ఇండస్ట్రీస్‌కి గెస్ట్‌గా వచ్చారు. కాంట్రాక్ట్ సంతకం అయ్యాక యిలాగే ఆ రాత్రి వాకింగ్ కెళ్ళి పాము కాటు వల్ల చచ్చిపడి కనిపించాడు మర్నాడు".

సురేష్‌కి తేలిగ్గా తెలిసిపోయింది. ఆ పాములు మరెవరో కాదు మాధురి, విష్ణు సహదేవ్, విక్కీ, ఇంకా సెక్యూరిటీ గార్డ్‌లు. సురేష్ నిశ్శబ్దంగా కాటేజ్ వేపు నడిచాడు. బెడ్ రూమ్ కెళ్ళాలంటే భయంగా వుందతనికి.

ఒకవేళ ఈ బెడ్ రూమ్‌లో పాము కరవదుగా. ఏమో! ఏం జరిగినా జరగవచ్చు.

"గుడ్ నైట్ సర్" తలుపు బయట ఆగిపోయిందామె.

"గుడ్‌నైట్"

"ఈ సారి నిద్ర రాకపోతే నన్ను పిలవండి సార్! నేనూ వాకింగ్ కొస్తాను. ఒంటరిగా మాత్రం వాకింగ్ వెళ్ళకండి".

సురేష్ తలుపు మూసేశాడు. ఓసారి కలయచూశాడతను. కిటికీలు తెరచి వున్నాయి. కిటికీలో నుంచి అతి తేలిగ్గా తనను కాల్చి చంపచ్చు.

తన ముఖం అందరికీ తెలుసు కాబట్టి అర్జున్ పోలికలతో ఇంకెవరూ వుండకూడదు కాబట్టి తనను కాల్చిచంపేదే ఖాయం! లేకపోతే వాళ్ళకు లేనిపోని సమస్యలు. ఏ రోజుకయినా తను వాళ్ళను బ్లాక్‌మెయిల్ చేయవచ్చు. జరిగిందంతా బయట పెట్టవచ్చు. దుప్పటి కప్పుకుని పడుకున్నాడతను. శరీరంలో సన్నని వణుకు! బయట చీకటి భయంకరంగా కనబడుతోంది.

శరత్ ఏమయి వుంటాడు? ఈ నరకం నుంచి తప్పించుకుని సుఖంగా హాయిగా ఆనందంగా, స్వేచ్ఛగా వూపిరి పీలుస్తూండి వుంటాడు అతని ఇంట్లో అతని ఫామిలీ మెంబర్స్ మధ్య.

తులసి గుర్తుకొచ్చిందతనికి. ఉహు తనొక క్షణం కూడా ఇక్క డుండటానికి వీల్లేదు. వెంటనే తప్పించుకుని పారిపోవాలి. తనకు డబ్బు కూడా అక్కర్లేదు.

ఫోన్ మళ్ళీ క్లిక్‌మన్న శబ్దం వినిపించింది. ఒక్క ఉదుటున లేచి నెమ్మదిగా రిసీవర్ అందుకుని చెవి దగ్గర పెట్టుకున్నాడు. ఎక్స్‌టెన్షన్ ఫోన్ ప్లగ్ తీసేయటం మర్చిపోయినట్లున్నారు.

"విక్కీ"

"ఎస్ మేడమ్"

"అంతా అయిపోయింది"

సురేష్ అదిరిపడ్డాడు. అంటే.....అంటే......

"ఇంచుమించుగా చనిపోయినట్లే . మహా అయితే నాలుగయిదు గంటలు గడువిచ్చాడు డాక్టర్"

"శరత్ దొరికాడా మేడమ్?"

"వాడెక్కడికీ తప్పించుకుపోడులే. పెద్ద ఎత్తున వెతుకున్నారు విక్కీ. సురేష్ విషయంలో చాలా జాగ్రత్తగా వుండు. ఇంకొక్క రోజు కనిపెట్టి వుంటే చాలు. తర్వాత యింకే సమస్యా వుండదు".

"అలాగే మేడమ్"

ఫోన్ డిస్ కనెక్ట్ అయింది.

సురేష్‌కి చెమటలు పట్టేసినాయి. ఫోన్ జాగ్రత్తగా శబ్దం కాకుండా పెట్టేశాడు. గుండెల్లో దడ. దానికితోడు దాహం నోరార్చుకుపోతున్నట్లుంది. అయినా అక్కడినుంచి కదలాలని లేదు.

"ఇంకొక్క రోజు అంతే ! తర్వాత యింకే సమస్యా వుండదు" మాధురి మాటలు స్టీరియోలో వినబడుతున్నట్లున్నాయి.

అర్జున్‌ని కూడా సహదేవ్ మాధురి కలసి చంపటానికి ప్రయత్నిస్తున్నారు. సందేహం లేదు.